మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# విద్యారంగంలో నెంబర్ వన్ చేయాలి

- సావిత్రి బాయి పూలే స్ఫూర్తి తో పునరంకితం కావాలి
- మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలు
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి
- 17 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు పురస్కారాలు



ఉపాధ్యాయులను సన్మానించిన జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి3 ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సావిత్రీ బాయి పూలే జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రీ బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. సావిత్రీ బాయి పూలే 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నయాగావ్ గ్రామంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించినట్లు తెలిపారు. ఆ కాలంలో ఆడ పిల్లలకు చదువు అనేది దూర స్వప్నం. కేవలం 9 ఏళ్ల వయస్సులోనే జ్యోతిరావు పూలే తో వివాహం జరిగిందని అన్నారు. కానీ ఆ వివాహం సావిత్రి బాయి జీవితాన్ని మలుపు తిప్పిందని అన్నారు. జ్యోతి రావు పూలే సంఘ సంస్కర్త,కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన మహాను భావుడు ఆయన తన భార్య సావిత్రిని చదివించారు. ఇంట్లోనే మొదటి అక్షరాలు నేర్చారు. తర్వాత అమెరికన్ మిషనరీల్లో ఉపాధ్యాయ శిక్షణ తీసుకున్నారు. ఆమె చదువుకునే కోరిక ధైర్యం చూసి జ్యోతిరావు పూలే ప్రోత్సహించారని అన్నారు. 1848 లో భారత దేశంలో మహిళలకు చదువు నిషేధం గా ఉన్న ఆ కాలంలో పూలే దంపతులు పూణే లోని భిడే వాడలో భారత దేశతొలి బాలికల పాఠశాలను ప్రారంభించారని అన్నారు.ఆపాఠశాలకు తొలి ఉపాధ్యాయిని,భారత దేశ మొదటి మహిళా ఉపాధ్యాయరాలు సావిత్రి బాయి పూలే అని కలెక్టర్ తెలిపారు. కేవలం ఒక పాఠశాల తో ఆగకుండా పూలే దంపతులు మొత్తం 18 పాఠశాలలు స్థాపించారని అన్నారు. బాలికలకు,దళితులకు,వెనుకబడిన వర్గాలకు 1852లో మహిళా సేవా మండల్ స్థాపించి మహిళల హక్కుల కోసంపోరాడారు. సావిత్రి బాయి పూలే జీవితం మనందరికీ ప్రేరణ అన్నారుఆనాడు సావిత్రిబాయి విద్యకు నాటిన బీజాల ఫలితంగానే నేడు బాలికలకు, బాలురకు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించగలుగుతున్నాము. అలాగే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 52 శాతం మంది మహిళలు,58 శాతం బాలికలు చదువుతున్నారని, ప్రభుత్వ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తి తో విద్యా రంగంలో జిల్లాను గత సంవత్సరం కన్నా పలితాలలో మెరుగుపరచి ముందంజలో ఉండేలా పునరంకితం కావాలని ఉపాధ్యాయులను కలెక్టర్ కోరారు. ఉత్తమ మహిళా ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలుపుతూ వారు మరింత అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను ఇంకా మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి విద్యా శాఖ ద్వారా ఎంపిక చేయబడ్డ వివిధ పాఠశాలలకుచెందిన 17మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులకు ఉత్తమ మహిళా ఉపాధ్యాయ" అవార్డులను ప్రదానం చేసి వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, డిపిఆర్ఓ పి. శ్రీనివాస్, ట్రైనీడిపిఓ నిఖిల, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డా.కె.కృష్ణ, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిని ఇందిర, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణు, గోపాల్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సిఎంఓ సుధాకర్ రెడ్డి, ఎంఈఓలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జీవితం

# నేటి మహిళలకు ఆదర్శప్రాయం

- దేశంలో మహిళలను అక్షరాస్యులను చేయడంలో సావిత్రిబాయి పూలేది కీలక పాత్ర
- జిల్లాలో బడిఈడు అమ్మాయిలందరూ బడిలో చదువుకునే విధంగా మహిళా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారెడ్డి

**వనపర్తి, జనవరి 3 ప్రభాతవార్త:** భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జీవితం నేటితరం ఉపాధ్యాయులకు, మహిళలకు ఆదర్శప్రాయమని, ఆమె అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. శనివారం సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సావిత్రి బాయి పూలే పురస్కారాలు 2026 వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరై సావిత్రిబాయి చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మహిళా ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి, సావిత్రిబాయి పూలే పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జీవితం నేటితరం ఉపాధ్యాయులకు, మహిళలకు ఆదర్శప్రాయమని, ఆమె అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. సావిత్రిబాయి పూలేకు బాల్యంలోనే వివాహం జరిగినప్పటికీ ఆమెభర్త సహాయంతో చదువుకుని పదహారేళ్లకే ఉపాధ్యాయురాలుగా జీవితాన్ని ప్రారంభించారన్నారు. అత్యంత చిన్న వయసులోనే బాంబే ప్రెసిడెన్సీ నుంచి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డును అందుకున్నారు. ఆమె మహిళలందరూ చదువుకోవాలని ఆకాంక్షతో మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను స్థాపించి అక్షరాస్యులను చేయడంలో కీలకపాత్ర వహించారు. మహిళల కోసం ఆమె విద్యను బోధించడం ప్రారంభించినప్పుడు సమాజం నుంచి ఎన్నో ఇబ్బందులను ఆమె ఎదుర్కొన్నారని తెలియజేశారు. అయినా పట్టు వదలకుండా ఆమె మహిళా విద్యకు ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు.అందుకే ఆమె జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అణగారిన వర్గాల్లోని మహిళల అభ్యున్నతి కోసం ఎంతో పాటు పడ్డారని కొనియాడారు. సావిత్రిబాయి పూలే సేవలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని, ఆమె మార్గంలో నడిచి ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. సావిత్రిబాయి పూలే జన్మదినంరోజున మనం మహిళా ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించుకోవడం చాలా గొప్ప విషయమని చెప్పారు.ఈ రోజు మన జిల్లాలో కూడా మహిళ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతో గొప్పగా పని చేస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. ఇటీవలి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళ –మిగతా4లో..

# సామాజిక రుగ్మతలు తొలగించేందుకు కృషి చేయాలి



ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన కలెక్టర్ సంతోష్

**గద్వాల జనవరి 3, ప్రభాతవార్త:** విద్యార్థులకు విద్యా బోధన తోపాటు బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక రుగ్మతలను తొలగించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. దేశతొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతినీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం ఐడిఓసి సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ మహిళ ఉపాధ్యాయుల పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మొదట కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, సావిత్రి బాయి చిత్రపటానికి పూజలు చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో నేటికీ అక్కడక్కడ మహిళల పట్ల వివక్ష కొనసాగుతోందనీ పూలే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్త్రీ విద్యకు కృషి చేయాలన్నారు. 19వ శతాబ్దంలో మన దేశంలో మహిళలకు చదువు నేర్పించేందుకు ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని మహాత్మా జ్యోతిరావు పూలే విశేష కృషి చేయగా, ఆయన సహకారంతో సావిత్రిబాయి పూలే 1848లో పూణేలో మహిళలకు మొట్ట మొదటి పాఠశాలను ఏర్పాటు చేసి విద్యా బోధన చేశారన్నారు. ఆమె స్ఫూర్తితో మహిళ ఉపాధ్యాయులు పుస్తకాల్లోని పాఠ్యాంశాలనే కాక విద్యార్థులకు సామాజిక అంశాల పట్ల కూడా అవగాహన కల్పించాలన్నారు. మన జిల్లాలో కొన్ని మారుమూల ప్రాంతాల్లో నేటికీ కొంతమంది బాల్యవివాహాలను చేస్తున్నారని, ఇతర రుగ్మతులను కూడా రూపుమాపేందుకు ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు.మన దేశంలో 50 శాతానికి పైగా మహిళ ఉపాధ్యాయులు ఉండడం మనకెంతో గర్వకారణమన్నారు. భవిష్యత్తులో దేశాభివృద్ధికీ కృషి చేసే భావి భారత పౌరులైన నేటి బాలలను ఉత్తములుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం ఎంపిక చేసిన 15 మంది ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు.జిల్లా విద్యాశాఖ అధికారిని విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రాజెక్టుపై బీఆర్ఎస్, బీజేపీ కపట ప్రేమ

- 50 శాతం చేసి 90 శాతం పనులు చేసామని కేసీఆర్ అబద్దాలు చెప్పారు
- ప్రజా ప్రభుత్వంలో ఇప్పటికే రూ.223 కోట్లు ఇచ్చారు
- ఆర్అండ్ఆర్ ప్యాకేజీ మొత్తాలను కూడా సీఎం రేవంత్ పెంచారు
- తాము అధికారంలోకి వస్తే జాతీయ హోదా ఇస్తానని 2014 ఎన్నికలకు ముందు మహబూబ్‌నగర్‌లో నరేంద్ర మోదీనే ప్రకటించారు
- అసెంబ్లీలో నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, జనవరి 3 ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయిపోయాయని ఎన్నికలకు ముందు నార్లాపూర్ లో జరిగిన సభలో అప్పటి సీఎం కేసీఆర్ అబద్దాలు చెప్పారని, వాస్తవానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 50శాతం పనులు మాత్రమే పూర్తి చేసారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేసారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఈ ప్రాజెక్టు పనుల్లో కదలిక వచ్చిందని, ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.223 కోట్ల నిధులు కూడా వచ్చాయని వివరించారు. శనివారం సాయంత్రం అసెంబ్లీలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై జరిగిన చర్చలో అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల ద్వంద్వ విధానాలను ఎండగట్టారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు గుండె కాయవంటి ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు పూర్తయితే 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఈ రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా మునుగోడు వరకూ నీళ్లు చేరుతాయని చెప్పారు. అయితే అత్యంత ప్రధానమైన ఈ రిజర్వాయర్ ను బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని,నాలుగేళ్లపాటు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులివ్వకుండా వారి బతుకులను రోడ్డు పాల్జేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా పాలన మొదలైన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ విషయంపై దృష్టిసారించి ఇప్పటి వరకురూ.223 కోట్లరుపాయలను ఉదండాపూర్ నిర్వాసితులకు అందించారని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఉదండాపూర్ నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమస్యను డిసెంబర్ 9 వ తేదీలోపుగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ ప్రకారంగానే వారి ప్యాకేజీ మొత్తాలను పెంచుతూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అనిరుధ్ రెడ్డి వివరించారు. 2014 ఎన్నికలకు ముందు తమ పార్టీ దేశంలో అధికారంలోకి వస్తే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇస్తామని మహబూబ్ నగర్ లో జరిగిన బహిరంగ సభలో నరేంద్ర మోదీ ప్రకటించారని, అయితే ఇప్పుడు ఆ విషయం గురించి బీజేపీ నేతలు ప్రధాని నరేంద్ర మోదీని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీసారు. గతంలో సినీనటి రోజా ఇంటికి వెళ్లి చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమను చేస్తానని కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేసారు. రోజా ఇంటికి వెళ్లి చేపల పులుసు తినడానికి కేసీఆర్ కు టైమ్ ఉందని, కానీ ఉదండాపూర్ నిర్వాసితులు ఆయనను కలవడానికి వెళ్తే టైమ్ లేదని వారిని అరెస్ట్ చేయించారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై మొసలి కన్నీరు కారుసక్తున్న కేసీఆర్ఇప్పుడు పాలమూరులో బహిరంగ సభ పెడతానని అంటున్నారని, అయితే ఆయన ఈ సభ పెట్టకముందే ఉదండాపూర్ నిర్వాసితులకు క్షమాపణ చెప్పాలని అనిరుధ్ రెడ్డి డిమాండ్ చేసారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో భాగమైన కరివెన రిజర్వాయర్ వద్ద కుర్చీ వేసుకొని కూర్చొని పనులు పూర్తి చేయిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేసారు. అయితే ఇప్పుడు కేసీఆర్ కనిపించడం లేదు, ఆయన కుర్చీ కూడా కనిపించడం లేదంటూ అనిరుధ్‌రెడ్డి ఎద్దేవా చేసారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణ పనులు 90శాతం పూర్తయ్యాయని నార్లాపూర్‌లో కేసీఆర్ అబద్దాలు చెప్పారని, వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలో 50శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని స్పష్టం చేసారు. ప్రాజెక్టులు పూర్తి చేయడం బీఆర్ఎస్ నేతల లక్ష్యం కాదని, వాటిని అసంపూర్తిగా పెట్టి అంచనాలు పెంచి కమీషన్లు దండుకోవడమే వారి విధానమని తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతులకు సంకెళ్లు వేసి, కాంట్రాక్టర్ల జేబులు నింపడమే బీఆర్ఎస్ నేతల నీతి అని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వ హయాంలోనూ ఉదండాపూర్ నిర్వాసితులు ధర్నాలు చేసినా తాము వారిని అరెస్టులు చేయించలేదని, అందరినీ ఒప్పించి ఈరోజున ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజర్వాయర్ పనులు చేయిస్తున్నామని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే మూడేళ్ల కాలంలో ప్రాజెక్టు పనులు, రిజర్వాయర్ కు సంబంధించిన కుడి, ఎడమ కాల్వల పనులు పూర్తి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లా వాసి కావడంతో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ను పూర్తి చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నారని చెబుతూ, సీఎం రేవంత్ కు, డిప్యూటీ సీఎం భట్టికి అనిరుధ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# రైతులకు పెట్టుబడి సాయం రూ.10,000

## మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



మూలమల్లలో నీటి సిద్ది కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అరుణ

**ఆత్మకూర్ జనవరి3, ప్రభాతవార్త;** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు ప్రతి సంవత్సరం పిఎం కిసాన్ నిధులను ఇప్పటివరకు 6000 రూపాయలు మూడు విడుదలగా అందిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చే మార్చి నెల నుండి పెట్టుబడి సాయాన్ని 10,000 రూపాయలకు పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లుగా మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ వెల్లడించారు. శనివారం రోజు ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని ఎంపీ అరుణమ్మ ప్రారంభించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న రైతులకు ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం 6000 నుండి10,000 రూపాయల పెట్టుబడి అందించేందుకు చర్యలు ముమ్మరంగా చేపట్టామని ఈ విషయాన్ని రైతులు దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి పేద ప్రజలకు అందుతున్న ప్రతి సంక్షేమ పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానితుల ద్వారా రైతులకు గాని పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు కేవలంరాష్ట్ర ప్రభుత్వం మాత్రమే అందిస్తుంది అనే ప్రచారం చేసుకోవడం తగదు అన్నారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించే కార్యక్రమంలో భాగంగా కేంద్ర జనశక్తి విధానంలో పనిచేస్తున్న శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలుతీసుకుంటుందని ఆమెఅన్నారు.మూలమల్ల గ్రామంలో సైతం నీటి సిద్ధి కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమని ఎంపీ అన్నారు. గత నెలలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బిజెపి పార్టీకి ప్రజలు పెద్ద ఎత్తున పట్టం కట్టారని రాబోయేమున్సిపాలిటీ మరియు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో కూడా ప్రజలు బిజెపికి అవకాశం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో –మిగతా4లో..

# నారాయణ పేట చేనేత చీరలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు : ఎంపీ



**నారాయణపేట, జనవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలో చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం కింద చేనేత కార్మికులకు మగ్గాలు, ఆధునిక చేనేత యంత్రాలు, జాకార్డ్స్, ఫ్రేమ్ లూమ్, వైడింగ్ మిషన్, డాబీ తదితర పరికరాలను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు,ఎంపీ డీకే అరుణ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, ఆర్డీవో రామచందర్ నాయక్, వివిధ చేనేత సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ నారాయణపేట చేనేత చీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. మహారాష్ట్రలో పేటలో నేసిన చీరలకు అధిక డిమాండ్ ఉందన్నారు. చేనేత కార్మికులు మరింత నైపుణ్యం పెంచుకుని తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తి చేసి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. లబ్ధిదారులు 10శాతం వాటా చెల్లిస్తే మిగిలిన 90శాతం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పథకాలు వేగంగా అమలైతే మరో విడత త్వరగా మంజూరు అవుతుందని అన్నారు. చేనేత గొప్ప కళ అని, దీనిద్వారా నారాయణపేటకు మరింత గుర్తింపు తీసుకురావాలని మగ్గాలు నేసే మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటకొండ అధ్యక్షులు పగడకుల శ్రీనివాసులు, చిన్న జెట్రం చేనేత అధ్యక్షులు ఆంజనేయులు,గాంధీ నగర్ సొసైటీ అధ్యక్షుడు బత్తుల సతీష్, క్లస్టర్ అధ్యక్షులు శ్రీనివాస్, నవిలే విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిధులతో అయిజ రూపురేఖలు మారుస్తాం

- బిజెపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు



మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు

**అలంపూర్ జనవరి 3, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ పరిధిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో, రాబోయే అయిజ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశం బీజేపీ అయిజ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షులు తపాలా రామాంజనేయులు, మాజీ జిల్లా అధ్యక్షులు ఎస్.రామ చంద్రా రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తపాలా రామాంజనేయులు మాట్లాడుతూ, అయిజ మున్సిపాలిటీలో నిర్వహించిన ఈ ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లాలోనే మొదటి సమావేశం కావడం గర్వకారణం అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలదే అని స్పష్టం చేశారు.ప్రస్తుత పాలకులు,గత పాలకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, ఎన్నికలు పూర్తయ్యాక ప్రజలను మరిచిపోయారని తీవ్ర విమర్శలు చేశారు.వారి పాలన ప్రజల కోసం కాకుండా, అధికారులను సంతృప్తిపరచడానికే పరిమితమైందని, ప్రజల మౌలిక సమస్యలపై వారికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన, అయిజలో డిగ్రీ కళాశాల ఏర్పాటు విద్యార్థులకు వసతి గృహాలు, అయిజ-కర్నూలు మధ్య శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానంలో నూతన వంతెన, తుపత్రాల-మేడికొండ అంతర్రాష్ట్ర రహదారి మరమ్మతులు, ఇవన్నీ ఇప్పటివరకు అమలు కాలేదని ఆరోపించారు.పాలకులు మారినా పాలన విధానం మారలేదని, వారి నిర్లక్ష్యంతో అయిజ మున్సిపాలిటీలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి సమస్యలు ఏళ్ల తరబడి అలాగే కొనసాగుతున్నాయని అన్నారు.రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున –మిగతా4లో..

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

## శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన ధ్యేయం : వనపర్తి జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి

**వనపర్తి, జనవరి 3 ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం, ప్రజావాతావరణం ప్రశాంతంగా కొనసాగడం, అనవసర గుమి కూడింపులు నివారించడం లక్ష్యంగా జనవరి 01 నుంచి ఫిబ్రవరి 28 వరకు 30 పోలీస్ యాక్ట్-1861 నిబంధనలు అమల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ సునితరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లా పరిధిలో ఎవరైనాపోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు,ర్యాలీలు, బహిరంగ సభలు,భారీస్థాయి సమావేశాలు నిర్వహించడం కఠినంగా నిషేధం.ప్రజా జీవనాన్ని అంతరాయం కలిగించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యకైనా చోటులేదని అని స్పష్టం చేశారు.

# పత్తి విత్తనాల బ్యాగులను చోరీ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

**దేవరకద్ర,జనవరి 3 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్టం నెల్లూరుకు చెందిన పచ్చ వెంకటేశ్వర్లు వెంకటయ్య పల్లి గ్రామంలో నివాసం ఉంటూ, కొన్ని సంవత్సరాలుగా బలుసుపల్లి శివారులో పొలాన్ని కౌలుకు తీసుకొని సీడ్ పత్తి పంటను సాగు చేస్తున్నాడు. పండించిన పత్తిని రాయచూరులో అమ్మి, పత్తి నుండి వేరు చేసిన విత్తనాలు గ్రేడింగ్ కోసం తీసుకుని వచ్చి తన పొలం దగ్గర ఉన్న రూమ్ లోపల ఉంచగా, డిసెంబర్ 31న గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి 30 చిన్న విత్తనాల బ్యాగులను ఎత్తుకెళ్లారు. అదే రోజు గూరకొండ లో దాసరి మల్లేష్ అనే రైతు పొలం దగ్గర కూడా ఇదే రకం 55 పత్తి విత్తనాల బ్యాగులను దొంగలించారు. ఈ విషయంపై బాధితులు ఇద్దరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకద్ర ఎస్సై నాగన్న తెలిపారు. దొంగలించిన పత్తి విత్తనాల విలువ రూ. 17 లక్షల వరకు ఉన్నట్లు ఫిర్యాదులో బాధితులు పేర్కొన్నారు.

# యూరియా కొరత లేదు.. రైతులకు సరిపడా యూరియా నిల్వలు

**లింగాల, జనవరి3 ప్రభాతవార్త:** యూరియా కోసం రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, సరిపడు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి అనిల్, తహసీల్దార్ బి.వెంకటేష్ అన్నారు. శనివారం లింగాల మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలోని యూరియా నిల్వలకు సంబంధించినరికార్డులను పరిశీలించారు.అనంతరం తహశీల్దార్ బి.వెంకటేష్ మాట్లాడుతూ సింగిల్ విండో కార్యాలయం అంబట్ పల్లిలో 20.25 మెట్రిక్ టన్నులు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం రాంపూర్ సమీప కేంద్రంలో 13.5 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగిల్ విండో కార్యాలయం అంబట్ పల్లిలో ఇంకా 30 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు అవసరమైన యూరియా సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని ఏఓ తెలిపారు. రైతులు ఎవ్వరూ కూడా ఆందోళన చెందవద్దని సహకరించాలని కోరారు. తహశీల్దార్ వెంట ఆర్ఐ వెంకటేష్, సిఈఓ పాండు ఉన్నారు.

# మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అధికారుల తనిఖీలు

**గద్వాల జనవరి 3, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలోలోని పలు మండలలో గల మెడికల్ షాపులో డ్రగ్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ డైరెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అంజుమ్ అబిధా ఆదేశానుసారం శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దినేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మానోపాడ్, ఉండవెల్లి, ఎర్రవల్లి మండలాల్లో జాయింట్ తనిఖీలు చేసారు. అందులో బాగంగా తొమ్మిది మందుల షాపుల్లో ఉల్లంఘనలు గుర్తించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల్ జిల్లా ఇంచార్జి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్ మాట్లాడుతూ.. సేల్‌బిల్స్, ప్రిస్క్రిప్షన్ లేకుండా హైయ్యర్ యాంటీబయాటిక్స్ , స్టెరాయిడ్స్ సేల్స్ చేశారని, ఒక మెడిషియల్ షాప్ లో ఫిజిషియన్ శాంపిల్స్ కూడా గుర్తించామని, షో కాజ్ నోటీసు జారి చేశామని, తదుపరి విచారణ జరిపాక తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా మొత్తం 9 మెడికల్ షాపులపై తనిఖీలు నిర్వహించగా, సంబంధిత రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు, విక్రయ వివరాలను పరిశీలించారు. లైసెన్స్ నిబంధనలు పాటిస్తున్న విధానాన్ని కూడా అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. వినయ్, మొహమ్మద్. రఫీ, ఎ. రష్మి విశ్వంత్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

### జిల్లా రవాణా శాఖ అధికారి బి. మానస



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు

**వనపర్తి, జనవరి3 ప్రభాతవార్త:** రోడ్డు సేఫ్టీ నిబంధనల పై ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వనపర్తి జిల్లా రవాణా శాఖ అధికారి బి.మానస పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ బాలుర పాఠశాల విద్యార్థులకు రోడ్ సేఫ్టీ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు ప్లకార్డులను ప్రదర్శిస్తూ రోడ్డు సేఫ్టీపై ఏఎంవి ఐ.సైదులునాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత అనే అంశంపై విద్యార్థులకు త్వరలో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామని ఈ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని విద్యార్థులకు డిటిఓ కార్యాలయం నుండి బహుమతులు అందజేస్తామని డిటిఓ మానస తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు శ్రీను, వెంకటేశ్, పాఠశాలల ప్రిన్సిపాల్‌లు ఉన్నారు.

## అయ్యవారిపల్లి తండాలో మంచి నీటి సౌకర్యం కల్పించిన సర్పంచు

**ఉప్పునుంతల, జనవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామపంచాయతీ శివారు గ్రామైన అయ్య వారి పల్లితండాలో మంచినీటి తీవ్రత అధికంగా ఉండడంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి నెరవేర్చారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గిరిజనులకు మంచినీరు సమస్య అధికంగా ఉందని ఎన్నికల సమయంలో తండా వాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యపైఅచ్చంపేట ఎమ్మెల్యేడా.చిక్కుడు వంశీకృష్ణ సర్పంచ్ జిల్లెల జగత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచు,వార్డు సభ్యులను గెలిపించిన వెంటనే మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ,అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు తండాలో బోరువేసి బోరు మోటర్ బిగించి తండా వాసులకు మంచినీటి సౌకర్యం కల్పించారు. మంచినీటి సౌకర్యం కల్పించిన గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి, ఉప సర్పంచ్ జరుపుల బాలు, వార్డు సభ్యులకు గిరిజనసోదరులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిల్లెల జగత్ రెడ్డి, ఉప సర్పంచ్ జరుపుల బాలు, పంచాయతీ కార్యదర్శి జైపాల్, వార్డు సభ్యులు శ్రీను, అంజయ్య, నరేందర్ రెడ్డి, స్థానిక గిరిజన సోదరులు, ప్రజలు పాల్గొన్నారు.

## మేడమోని మల్లేష్‌కు భారత్ విభూషణ్ అవార్డు-2026

### జిల్లా కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా జాతీయ స్థాయి గౌరవం



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా భరత్ విభూషణ్ అవార్డు అందుకుంటున్న మేడమోని మల్లేష్

**ఉప్పుకుంతల, జనవరి 3 ప్రభాతవార్త:** ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ మిస్టర్ మేడమోని మల్లేష్‌కు ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్-భారత్ విభూషణ్ అవార్డు 2026 లభించడం గర్వకారణంగా నిలిచింది. ఈ పురస్కారాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్, జిల్లా విద్యాశాఖాధికారి ఏ.రమేష్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ఉపాధ్యాయులు, ఉద్యోగులు లక్ష్యంగా అనేక పాఠశాలలు, కళాశాలల్లో మోటివే షనల్ సెషన్లు నిర్వహిస్తూ, వందలాది మందిలో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన దిశగా సానుకూల మార్పు తీసుకు వచ్చినందుకు మేడమోని మల్లేష్ ఈ జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. ట్రైనర్‌గా, స్పీకర్‌గా ఆయన చేసిన సేవలు విద్యారంగానికి ఎంతో దోహదపడినట్లు ఈ సందర్భంగా అధికారులు ప్రశంసించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో, జీవిత లక్ష్యాలపై స్పష్టత కల్పించడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేడమోని మల్లేష్ మాట్లాడుతూ ఈ అవార్డు నాకు మాత్రమే కాదు, నా మీద నమ్మకం ఉంచిన ప్రతి విద్యార్థి, ప్రతి యువతకు దక్కిన గౌరవం అని ,సమాజంలో సానుకూల మార్పు కోసం నా ప్రయాణం మరింత బాధ్యతతో కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వివిధ సంస్థల ప్రతినిధులు, అభిమానులు పాల్గొని మేడమోని మల్లేష్‌ను ఘనంగా అభినందించారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ అవార్డు నాగర్‌కర్నూల్ జిల్లాకు మరింత గౌరవాన్ని తీసుకొచ్చిందని పలువురు ప్రశంసించారు.

## మా గ్రామంలో మంచి నీటి సమస్య లేకుండా చేయాలి

### అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఉప్పునుంతల సర్పంచు శ్రీనివాసులు

**ఉప్పునుంతల, జనవరి3 ప్రభాతవార్త:** ముందు చూపు లేకుండా ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణాలు చేపట్టారు కానీ జనాభా పెరుగుదలకు మంచినీటి సరఫరా సరిపడు లేదని గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు ఆర్ డబ్ల్యూఎస్ అధికారులకు వివరించారు. ట్యాంకులు నిర్మాణాలు కెపాసిటీ పెంచి ఉంటే మంచినీటి తీవ్రత ఉండదని గ్రామంలో వేసవికాలంలో మంచినీటి సమస్య ఉండకూడదనిశనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. బీసీ కాలనీ తూర్పులో మంచినీటి సరఫరా అవుతున్న లైన్లను పరిశీలించారు. గ్రామంలో ఎక్కడ మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అని లైన్లను పరిశీలించిన తదుపరి తమ హయాంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని ఆయన ఏ ఈ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరంఏఈ సాయికృష్ణను సర్పంచ్‌గా గెలుపొందిన తర్వాత మొట్టమొదటిసారిగా కలుసుకోవడంతో ఎఇసాయికృష్ణను సర్పంచ్ శ్రీనివాసులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## నూతన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### పేట జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్

**నారాయణ పేట, జనవరి3 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రెండు నూతన పథకాలను మళ్లీ ప్రారంభించిందని నారాయణపేట జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ. రషీద్ తెలిపారు. ఈ పథకాలను అర్హులైన మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు, అవివాహిత మైనారిటీ మహిళలకు చిన్న వ్యాపారాల కోసం ఒక్కొక్కరికి రూ.50,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. అలాగే రేవంతన్నాకా సహారా పథకం కింద ఫకీర్,దుదేకుల వర్గాలకు చెందిన పేద మైనారిటీలకు మోపెడ్ వాహనాల కోసం ఒక్కొక్కరికి రూ.1.00 లక్ష గ్రాంట్ కేటాయించినట్లు పేర్కొన్నారు ఈ పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 05012026 ఉదయం 10:30 గంటలకు ప్రారంభమై, 10 012026 రాత్రి 11:50గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆఫ్‌లైన్ దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. అర్హులైన వారు టిజిఒ.బిఎంఎంఎస్.సిజిజి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని మైనారిటీ మహిళలు ఫకీర్, దుదేకుల వర్గాల వారు పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## పేదరికం కారణంగా ఎవరు న్యాయానికి దూరం కావొద్దు

### బాల్య వివాహాలను అరికట్టాలి : డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్

**నారాయణ పేట, జనవరి 3 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బీసీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఎవరూ న్యాయానికి దూరం కావొద్దని అన్నారు. పేద,బలహీన వర్గాలకు న్యాయ సహాయం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు పేదరిక నిర్మూలన పథకాల సమర్థ అమలు స్కీమ్-2015 అమలులో ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మధ్య వర్తుల ప్రమేయం లేకుండా అందేలా న్యాయ సేవా సంస్థలు కృషి చేస్తాయని చెప్పారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని సూచించారు. బాల్య వివాహాల నివారణ,పిల్లలరక్షణకు పోక్సో చట్టం,బాల కార్మికుల నిరోధంపై అవగాహన కల్పించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లు నాటడం, ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల నిర్వహణపై ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్లాలి

### అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్



సంపత్ కుమార్‌ను శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

**అలంపూర్ జనవరి3, ప్రభాతవార్త:** నూతన సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళుతూ పార్టీని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి ఎస్.ఎ సంపత్ కుమార్ పేర్కొన్నారు.శనివారం రోజుశాంతినగర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ ను పార్టీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి 2026 వ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంవత్సరం రెట్టింపు ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. మరి కొద్ది రోజుల్లో మున్సిపాలిటీ ఎన్నికలు రాబోతున్న తరుణంలో సోషల్ మీడియాలలోకొంత మంది చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఒడిదుడుకులు ఎదురైనా అల్లంపూర్ నియోజకవర్గాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తుందని తెలిపారు. ఇదే ఒరవడితో క్షేత్రస్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎఐసిసి కార్యదర్శిని కలిసిన వారిలో రాష్ట్ర టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ ఇస్మాయిల్, సుల్తానాపురం సర్పంచ్ మురళి గౌడ్, ర్యాలంపూర్ సర్పంచ్ రఫీ,కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంధ్య బాబుతోపాటు అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్,లాల్‌గౌడ్, గడుమూరు మోహన్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



ప్రాథమిక పాఠశాలను సందర్శించిన మర్రిపల్లి సర్పంచ్ భూపాల్ రావు

**ఉప్పునుంతల, జనవరి3 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, పాఠశాలలపై నమ్మకం కలిగిస్తున్న ఉపాధ్యాయులను మాజీ డిసిసిబి డైరెక్టర్, మర్రిపల్లి సర్పంచ్ సత్తు భూపాల్‌రావు అభినందించారు. శనివారం ఆయన పాఠశాలను సందర్శించిపాఠశాల స్థితిగతులను, విద్యార్థులకు అందిస్తున్న బోధన పట్ల ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ పిల్లలను అదే పాఠశాలలో చేర్పించడం, వారి పిల్లలతో పాటు పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నమ్మకం కలిగిస్తూ బలోపేతం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆ పాఠశాల హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు భూపతికుమార్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వ పాఠశాల పట్ల నమ్మకం కలిగించే విధంగా కృషి చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న భూపతి కుమార్ తన ఇద్దరు పిల్లలను అదే పాఠశాలలో చేర్పించి నిరుపేద విద్యార్థులతో పాటు నాణ్యమైన విద్యను అందించడం ఉపాధ్యాయుల స్ఫూర్తికి నిలయమని చెప్పవచ్చు అన్నారు. అదే పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అంగన్‌వాడి కేంద్రంలో ఎంతమంది చిన్నారులు కేంద్రానికి వస్తున్నారని ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని అంగన్వాడి కార్యకర్తకు సూచించారు.

## బేడ బుడగ జంగాల హక్కులకై పోరాడుదాం!

### బిజెహెచ్‌పిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిరివాటి శ్రీనివాసులు



నూతన కార్యవర్గాన్ని సత్కరించిన నాయకులు

**చిన్నచింతకుంట, జనవరి 3 ప్రభాతవార్త:** బేడ బుడగ జంగాల హక్కులకై కలిసికట్టుగా పోరాడుదామని బిజెహెచ్‌పిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిరివాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని శ్రీ కురుమూర్తి దేవస్థాన ప్రాంగణంలో నియోజకవర్గ బేడ బుడగ జంగం హక్కుల సంఘం నూతన కార్యవర్గానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవరకద్ర నియోజకవర్గ బేడ బుడగ జంగం హక్కుల పోరాట సంఘం అధ్యక్షులుగా సిరువాటి జంగం రవి, దేవరకద్ర మండల అధ్యక్షులుగా పొన్న కంటి శ్రీనివాస్, చిన్న చింతకుంట మండల అధ్యక్షులుగా గగనం శంకర్, కౌకుంట్లమండల అధ్యక్షులుగా సిరివాటి తిరుపతయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ బేడ బుడగ జంగాలు కలిసికట్టుగా పోరాడితేనే హక్కులను సాధించుకుంటామని తెలిపారు. బేడ బుడగజంగాలు విద్యలో రాణించినప్పుడే రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో ముందుంటారని ఆయన తెలిపారు. దేవరకద్ర నియోజక వర్గంలో బుడగ జంగాల సమస్యలపై పోరాడుతానని నియోజకవర్గ బుడగ సంఘం నూతన అధ్యక్షులు జంగం రవి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పొన్న కంటి రాంబాబు,మహిళా అధ్యక్షురాలు సిరిగిరి పారిజాతమ్మ ,మాజీ జిల్లా అధ్యక్షులు రాచారి శ్రీనివాసులు, గగనం మన్యం మాజీ నియోజకవర్గ అధ్యక్షులు సిరిగిరి శీను, సిరివాటి కర్ణాకర్, వెంకటగిరి గ్రామ సర్పంచ్ పొన్నగంటి లక్ష్మయ్య, వివిధ మండల నాయకులు సిరిగిరి పరుశురాం, సిరిగిరి వెంకటేష్, సిరిగిరి మహేందర్, సిరిగిరి కురుమన్న, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తా

### సర్పంచ్ చింత గాళ్ల శ్రీనివాసులు



**ఉప్పునుంతల, జనవరి3 ప్రభాతవార్త:** పిఎం శ్రీజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని సర్పంచ్ శ్రీనివా సులు అన్నారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉప్పు నుంతల గ్రామ సర్పంచుగా ఎన్నికైన సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసు లును పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ పాఠ శాల హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మానకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసులు ,ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యా ర్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పాఠశాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరుతూ పాఠశాలకు కావలసిన మౌలిక వసతుల పట్ల తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు:** పిఎం శ్రీజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల ఆవరణలో రాజస్వ ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నీలం శ్రీధర్, పోకల సతీష్, చంద్రశేఖర్, శ్యాంసుందర్ గౌడ్, అజ్మతుల్లా, శ్రీనివాసులు, రాజవర్ధన్ రెడ్డి, రాజు, కల్పన, శ్యామల గౌరీ తదితరులు పాల్గొన్నారు.

**వెల్టూర్ హైస్కూల్లో:** మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు వెంకటయ్య, రాజేందర్, చంద్రశేఖర్, తయ్యా బాలి జ్యోతి,విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

**మద్దూరు, జనవరి 3 ప్రభాతవార్త :** మద్దూరు మండల పరిధిలోని పొర్లకుంట తండా గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుల్ల నర్సింలు ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ నిర్వహించారు.గ్రామ అభివృద్ధిలో కీలకమైన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి పొర్లకుంట తండా గ్రామానికి చెందిన వి.దశరథ్ నాయక్ రెండుగుంటల భూమిని దాతగా అందజేయడం అభినందనీయమని గ్రామస్తులు ప్రశంసించారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు భూమి విరాళంగా ఇవ్వడం గ్రామాభివృద్ధిపై ఉన్న బాధ్యతా భావాన్ని ప్రతిబింబిస్తుందని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆర్.దశరథ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి సంబంధించిన అన్ని పరిపాలనా కార్యక్రమాలు ఈ భవనం ద్వారా సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ భవనం నిర్మాణంతో గ్రామస్థులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని, ఇది గ్రామాభివృద్ధికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు నాయక్, సురేష్ నాయక్, అనిల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, సంతోష్ నాయక్, సోమ్లా నాయక్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అందుల క్రీడాకారులకు గోల్‌బాల్‌పై శిక్షణ

**చిన్న చింతకుంట, జనవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని అల్లీపురం మినీ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర ఆంధుల సీనియర్ (స్త్రీ పురుషుల) గోల్ బాల్ క్రీడాకారుల శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఇండియన్ బ్లాండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలో పాట్నా పట్టణంలోని కంకర్బగ్, పాలిపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే 05 వ సీనియర్ (స్త్రీ పురుషులు) నేషనల్ గోల్ బాల్ ఛాంపియన్ షిప్ 2026లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర ఆంధుల సీనియర్ (స్త్రీలు పురుషులు) గోల్ బాల్ క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని గత నెల డిసెంబర్ 20 వ తేది నుండి ఈనెల జనవరి 03 వ తేదీ వరకు మండలంలోని అల్లీపురం గ్రామంలోని మినీ ఇండోర్ స్టేడియంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో గోల్ బాల్ లో మెళకువలను నేర్పించినట్లు తెలంగాణ రాష్ట్ర అందుల గోల్ బాల్ జట్టు కోచ్ నవీన్ కుమార్ తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియంలో శిక్షణ శిబిరానికి అనుమతినిచ్చిన తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు ఆయన తెలిపారు. సహకరించిన ఇండోర్ స్టేడియం కోచ్ గండ్ల నవీన్ కుమార్ ను శాలువాతో సత్కరించారు.

## మెగా ప్లాస్టిక్ సర్జరీ శిబిరం

**వనపర్తి, జనవరి3 ప్రభాతవార్త:** పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లైన్స్ క్లబ్‌ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్లాండ్స్), సేవా భారతి, మెర్సీ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల23, 24,25 న స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించి, జనవరి 26నుండి ఫిబ్రవరి 4వ తేదీ వరకు అవసరమైన వారికి ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీ నిర్వహిస్తున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ పి. మధుకర్ స్వామిసహకారంతో గ్రహణ మొర్రి,కాలిన గాయాలతో అవయవాలు, చేతి వేళ్ళు వంకరలు, జన్యుపర లోపంతో శరీరంపై విపరీతమైన వెంట్రుకలు పెరగడం వంటి సమస్యల నివారణకు అమెరికాకు చెందిన వైద్యులచే హైదరాబాద్ ఓల్డ్ మల్లేపల్లిలోని సీతారాం బాగ్ డా.ఈశ్వర్ చంద్ చారిటబుల్ హాస్పిటల్‌లో సర్జరీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు ఈ నెల 1 తేదీ నుండి 15వ తేదీ వరకు తమ పేరును 9542433427 నెంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేసి నమోదు చేసుకోగలరని తెలిపారు.

## రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది: ఏవో హైమావతి



**శ్రీరంగాపూర్, జనవరి3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల పరిధిలో శనివారం వివిధ ప్రవేటు పిఎసిఎస్ ఎరువుల దుకాణాలను ఏవో హైమావతి తనిఖీ చేయడం జరిగింది. మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలలో యాసంగి సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరానికి సరిపడే యూరియాను రైతులకు అందజేస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యూరియా కావలసిన రైతులు తమ యొక్క ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం జిరాక్స్ పత్రాలను యూరియా డీలర్లకు అందజేస్తే ఈ పాస్ యంత్రాలలో నమోదు చేసి పంట ఆధారంగా యూరియాను రైతులకు అందజేస్తారు అని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 115 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నాయని తెలియజేయడం జరిగింది. ఈ తనిఖీల్లో ఏవో హైమావతి, ఏఈఓ అనూష, పిఎసిఎస్ సిబ్బంది,డీలర్లు ఉన్నారు.

## శ్రీఆంజనేయ స్వామి ఆలయ శిఖర నిర్మాణ పూజలు



ఆలయ శిఖర నిర్మాణ పూజలు చేస్తున్న దృశ్యం

**ధన్వాడ, జనవరి3 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శిఖర నిర్మాణ పూజ కార్యక్రమం శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతిజ్యోతి రాంచంద్రయ్య, వార్డు మెంబర్ భారతమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అలాగే గ్రామ పెద్దలు రాంచంద్రయ్య, ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, విజయ్‌కుమార్, బాలకిష్టయ్య, పాల రాము, కాశయ్య, అయ్యప్ప, శివస్వాములు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**మద్దూరు, జనవరి 3 ప్రభాతవార్త:** మద్దూరు మండల పరిధిలోని జాదవరావుపల్లి తాండ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మహిళల గౌరవం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోఉపసర్పంచ్ కిమ్యా నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ రాము నాయక్, కిషన్ నాయక్, హన్మనాయక్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికి పౌష్టికాహారాన్ని అందజేయాలి

### దేవదారి కుంట తండా సర్పంచ్ మంగమ్మ

**ఉప్పునుంతల, జనవరి3 ప్రభాతవార్త:** మండలంలోని దేవదారి కుంట తండాలో శనివారం ఐసిడిఎస్ ప్రాజెక్టు వారు అందిస్తున్న పౌష్టికాహారాన్ని గ్రామసర్పంచ్ మంగమ్మ చేతులమీదుగా పంపిణీ చేశారు. అదే విధంగా స్థానిక ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడి కేంద్రం పరిధిలో వచ్చే పౌష్టికాహారం అరులైన వారికి అందే విధంగా చూడాలని సర్పంచ్ మంగమ్మ కోరారు. గ్రామంలోని మూడు నుంచి ఐదుసంవత్సరాల పిల్లలను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలనితల్లిదండ్రులకు సూచించారు.అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనంవారు పరిశీలించారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు ఆటపాటలతో నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, సర్పంచ్ మంగమ్మ రతన్ సింగ్ లను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు హెల్త్ సూపర్‌ప్రభావతి,దేవి, శ్రీనివాసులు,పాఠశాల ఉపాధ్యాయులురతన్ ప్రసాద్,జాన్, గ్రామపంచాయతీ కార్యదర్శి చందర్ లాల్, వైద్య సిబ్బంది దేవి, శ్రీను, వీణా, వార్డు సభ్యులు, తండా వాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ధన్వాడ విద్యార్థుల సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు

### రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపిక

**ధన్వాడ, జనవరి3 ప్రభాతవార్త:** ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాజేందర్, ప్రవీణ్ సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు నారాయణపేట జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమంగా నిలిచిరాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. రసాయన ఎరువులు, రసాయన పదార్థాలు వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం, జీవామృతం వినియోగం, అంతర పంటల సాగు, పంట మార్పిడి ద్వారా నేల ఆరోగ్యం, దిగుబడి, మానవ ఆరోగ్యంమెరుగుపడే విధానాలను విద్యార్థులు ఈ ప్రాజెక్టులో ప్రయోగపూర్వకంగా వివరించారు. అలాగే రసాయన ఎరువుల వల్ల కలిగే అనర్థాలు, వాటికి ప్రత్యామ్నాయంగా పశు పేడ, కంపోస్టు, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, బయో ఏజెంట్ల ద్వారా తెగుళ్ల నియంత్రణ, నీటి సంరక్షణతో కూడిన తక్కువ ఖర్చు వ్యవసాయ విధానాలను ఈ ప్రాజెక్టు ద్వారా చూపించారు. విద్యార్థుల ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, గైడ్ టీచర్ వెంకటమ్మలను అభినందించారు.

## మట్టి నమూనా పరీక్షలపై అవగాహన

**అలంపూర్ జనవరి 3, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ క్యాతుర్ గ్రామం, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, అలంపూర్ విద్యార్థులకు శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద నేల ఆరోగ్యం, సారవంతం అనే అంశం, మట్టి నమూనా పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జగ్గునాయక్, ప్రాజెక్ట్ డైరెక్టర్, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) జోగులాంబ గద్వాల జిల్లా గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాలు తీసి పరీక్షలు ఎలా చేయాలనే అంశంపై విద్యార్థులకు సవివరంగా తెలిపారు. క్షేత్రస్థాయిలో మట్టి నమూనాలను సేకరించే విధానంపై సలహాలు, సూచనలు చేశారు. ఈ పరీక్షల ద్వారా రైతులు తమ పొలంలో సూక్ష్మ, స్థూల పోషకాలు ఏ విధంగా ఉంటాయో తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రధానంగాఎకరం భూమిలో 8నుంచి 10 చోట్ల మట్టిని తీసుకుని 500 గ్రాముల మట్టితో పరీక్షను చేయవచ్చన్నారు. ప్రతి రైతు తమ భూమిలో సేకరించిన మట్టి నమూనాపై రైతు వివరాలు నమోదు చేసి భూసార పరీక్ష కేంద్రానికి పంపాలన్నారు. ప్రతీ రైతు భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగార్జున రెడ్డి, ఆత్మ సిబ్బంది శ్రీకాంత్, శ్రీధర్ రెడ్డి, ఏఈవో మానస, నీలిమ, క్యాతుర్ గ్రామ ఉప సర్పంచ్‌సురేష్ రెడ్డి, పాఠశాల హెచ్ ఎం మాధవి, సిబ్బంది కరుణాకర్, గ్రేషియా పాల్గొన్నారు.

3 గద్వాల5;మట్టి నమూనా పరీక్షలను చేస్తున్న అధికారులు.

## జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు

**మద్దూరు, జనవరి 3 ప్రభాతవార్త :** రోడ్డు భద్రత నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఏఎంవీఐ దీప్తి అన్నారు. మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలు, సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారుసీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. వేగ నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. అలాగే వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు కూడా భద్రతా నిబంధనల అమలులో భాగస్వాములు కావాలని, ప్రమాదకరంగా వాహనం నడిపే డ్రైవర్లను హెచ్చరించడంతో పాటు రోడ్డు భద్రతకు సహకరించాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత వాహనదారులకే కాకుండా ప్రతి ప్రయాణికుడి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దూరు ఎస్ఐ విజయ్‌కుమార్, ఏఎస్ఐ ఉస్మాన్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు కోరారు.

## నేడు ఎమ్మెల్యే రాక

**దేవరకద్ర, జనవరి 3 ప్రభాతవార్త :** దేవరకద్ర మండలం,కోయిల్ సాగర్ కు నేడు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రానున్నారని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10:30 గంటలకు దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ద్వారా సాగునీటి విడుదల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని నీటిని విడుదల చేస్తారని మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు,మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి కోరారు.

## రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ జిల్లా అధ్యక్షునిగా రవిగౌడ్ ఎంపిక

**నారాయణ పేట, జనవరి 3 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ పేట జిల్లా కమిటీని పట్టణంలో నిర్వహించిన సమావేశంలో రవిగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ అన్సార్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా అధ్యక్షునిగా రవి గౌడ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల స్థాయిల్లో కమిటీల ఏర్పాటు కొనసాగుతుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.డి. గుప్తా మరికల్, కోశాధికారిగా మహమ్మద్ యాసిన్ ఎన్నికయ్యారు. లీగల్ అడ్వైజర్‌గా సతీష్ గౌడ్, మెడికల్ అడ్వైజర్‌గా నర్సింగ్‌రావును నియమించారు.వైస్ ప్రెసిడెంట్లుగా జి.సతీష్,దుబ్బ ఆంజనేయులు, జి.నీలప్ప ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి చంద్రశేఖర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

**నారాయణ పేట జనవరి 3 ప్రభాతవార్త:** నారాయపేట జిల్లాకి చెందిన జాతీయ అవార్డు విజేతలను అభినందించారు. పేట షావోలి ఉషూ కుంగ్‌ఫు అకాడమీ ఆధ్వర్యంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నానక్ రామ్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. ఉట్కూర్ మండలం లక్ష్మీపల్లి చెందిన యు. శ్రీరామ్ పేట పట్టణం బహార్‌పేట్‌కు చెందిన కుమారి స్వాతి పల్లగేరి, ధన్వాడ మండలం మడిగెల మూల తాండకు చెందిన సంతోష్, జాతీయ మిక్స్ బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ, వెండి పతకాలు సాధించారు. మహారాష్ట్రలో జనవరి 25 నుంచి 28 వరకు జరిగినపోటీల్లో విజయం సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని రఘువీర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో క్రీడాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. పూర్ణ మలావత్ స్ఫూర్తితో మీరు కూడా మీ క్రీడా జీవితాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు సామల అజయ్ కుమార్, నారాయణపేట షీ టీమ్ ఇంచార్జ్ బాల్‌రాజ్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నానక్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను అరికట్టడం అందరి బాధ్యత

**నవాబుపేట, జనవరి 3 ప్రభాతవార్త :** రోడ్డు భద్రత పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్సై విక్రం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం చౌడపూర్ మండలం లోని చాకలపల్లి గ్రామంలో వాహనదారులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు భద్రతా వారో త్సవాలను ఏటా నిర్వహించి వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేయాలన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ చూడడం,నిద్రలేమి వంటికారణాలతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూడదని చెప్పారు. అనంతరం నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

## ట్రాన్స్‌జెండర్ల ఆర్థిక స్వావలంబన కోసం దరఖాస్తులు

**గద్వాల జనవరి 3, ప్రభాతవార్త:** ట్రాన్స్‌జెండర్ల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం 100 సబ్సిడీతో ఆర్థిక పునరావాస పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్ల ఆర్థిక అభివృద్ధి, స్వావలంబన లక్ష్యంగా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినఉత్తర్వుల ప్రకారం జోగులాంబగద్వాల్ జిల్లా పరిధిలోని అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు వంద శాతం సబ్సిడీతో స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకంకింద జిల్లాలోని అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు ఒక్కో యూనిట్‌కు రూ.75,000/ చొప్పున 100 పూర్తిస్థాయి సబ్సిడీతో ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు జిల్లాలోని అర్హులైన ట్రాన్స్‌జెండర్ల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని,అర్హులైన అభ్యర్థులు ట్రాన్స్‌జెండర్ గుర్తింపు పత్రం, విద్యార్హత,ఆదాయ,ఆధార్ ధృవపత్రాల ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటు తేదీ:08012026 లోపు జిల్లా సంక్షేమ అధికారి03.01.2026 కార్యాలయం,మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కలెక్టరేట్ కాంప్లెక్స్, రూమ్ నెం.జి 33, జోగులాంబ గద్వాల్ జిల్లా నందు దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 18 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలని,వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలు మించకూడదని తెలిపారు. గత ఐదు సంవత్సరాలలో వికలాంగుల సంక్షేమ శాఖ లేదా ఇతర ప్రభుత్వ శాఖల నుండి ఎలాంటి సబ్సిడీ పొందని వారు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఒక కుటుంబానికి ఐదు సంవత్సరాలలో ఒక్క స్వయంఉపాధి పథకం మాత్రమే మంజూరు చేయబడుతుందని, ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారు తదుపరి ఐదు సంవత్సరాల పాటు ఇలాంటి పథకాలకు అర్హులు కారని వివరించారు. సంబంధిత కార్యకలాపంలో అనుభవం లేదా శిక్షణ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

### మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**అమరచింత జనవరి3, ప్రభాతవార్త;** కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం అమరచింత మండలంలోని చంద్ర నాయక్ తాండగ్రామపంచాయతీలో కేంద్రప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేసిన హైమెస్టు లైట్లు పాలమూరు ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. అలాగే అమరచింత మున్సిపల్ కేంద్రంలోని శ్రీ హరిహర అయ్యప్పస్వామి ఆలయం దగ్గరపాలమూరు ఎంపీ డీకే, అరుణమ్మ మంజూరు చేసిన5 లక్షల నిధులతో ఏర్పాటుచేసిన సామాజిక నీటి శుద్ధి కేంద్రం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె ప్రారంభించారు. అనంతరం హరిహర అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాపూజకు హాజరై అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆలయం నిర్వాహకులు పాలమూరు ఎంపీడీకే అరుణమ్మను ప్రత్యేకంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత



మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

రెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు, మంగ లావణ్య, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేరువరాజు, క్యామ భాస్కర్, నరాల నారాయణ, మల్లారెడ్డి, దుబాయి వెంకటేశ్వర్ రెడ్డి, కురువ హరీష్, ఎస్ వెంకటేశ్వర్లు,తోకలి భీమసేన, క్యామభరత్ పాల్గొన్నారు.

## బిఎల్ఓలు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలి

**గద్వాల జనవరి3, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బి.ఎల్.ఓకి ప్రతి రోజు 30-40 ఎంట్రీల లక్ష్యాన్ని కేటాయించి, ప్రతి ఇంటి వద్దకు వెళ్లి క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ సందర్శనలు నిర్వహించి, టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. సూపర్వైజర్లు కూడా ప్రతీ రోజు ఇంటి ఇంటికి వెళ్లి ఫీల్డ్ సందర్శనలు నిర్వహిస్తూ ఎంట్రీలు పూర్తి చేయాలని సూచించారు. ఏ.ఈ.ఆర్.ఓలు, ఈ.ఆర్.ఓ లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమగ్రంగా పర్యవేక్షించి, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. డెస్క్ వర్క్‌ను సమాంతరంగా నిర్వహిస్తూ డేటా సరిగాఎంటర్ అయ్యేలా చూసుకోవాలని సూచించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటివరకు 49 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, ఎస్ఐఆర్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. బీఎల్‌వోలు మరియు సూపర్‌వైజర్లకు లక్ష్యాలు కేటాయించి,క్షేత్ర స్థాయిలో ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ అలివేలు, ఎన్నికల విభాగం అధికారి కరుణాకర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, తిలకిస్తున్న కలెక్టర్ సంతోష్, తదితర అధికారులు

# వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

**అమరచింత జనవరి 3, ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో శ్రీ శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో 33 వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమము శనివారం శ్రీ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా మహా పడిపూజ నిర్వహించారు. అలాగే శ్రీహరిపుత్ర అయ్యప్పస్వామికి ఉదయం అభిషేకం, కుంకుమార్చన, పండితులు నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయము నుండి పట్టణం లోని పురవీధులలో భక్తి గీతాల పనులతో అయ్యప్ప స్వామి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పూజ కార్యక్రమాన్ని మాకం నరసిం హులు గురుస్వామి, గోపాలకృష్ణ గురుస్వామి, దీపేష్ గురు స్వామి ఆధ్వర్యంలో శ్రీశ్రీఅయ్యప్ప స్వామి మహా పూజ భక్తి గీతాలా పనలతో, వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి మహా పూజకు హాజరైన భక్తులకు కేశం సిలాన్ గౌడ్, కేశం నాగరాజు గౌడ్, కేశం అశోక్ గౌడ్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వామి మహా పూజకు పట్టణంలోని భక్తులు భారీగా పాల్గొన్నారు. అలాగే అయ్యప్ప స్వామి మహా పూజకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ, పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మేరువా రాజు, మరాఠి అశోక్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు అరుణ్ కుమార్, కేజీ మహేందర్ రెడ్డి, శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం అధ్యక్షులు, మేడం కృష్ణయ్య, తోకలి రమేష్, క్యామ భాస్కర్, అంజన్ గౌడ్, కమలాకర్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



అమరచింతలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్న మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ

# రైతుల వివరాల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ భూపాల్ రెడ్డి

**గద్వాల జనవరి 3, ప్రభాతవార్త:** రైతుల భూములు, పంటలు, ఇతర వివరాలు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసి యూనిక్ ఐడి ఇవ్వాలనే ఉద్దేశంతో చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను జిల్లాలో వేగవంతం చేయాలని కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో మీసేవ కేంద్రాల్లో రైతులకు సంబంధించిన వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసే ప్రక్రియపై విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రీనర్స్‌లకు నిర్వహించిన శిక్షణకార్యక్రమంలో ఏవో పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు సమర్థవంతంగా, సులభంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ దోహదపడుతుందన్నారు. రైతుల పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుతో లింక్ ఉన్న మొబైల్ నెంబర్ను రిజిస్ట్రీకి వినియోగించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 1.83 లక్షలకు పైగా రైతులు ఉండగా ఇప్పటిదాకా 54 శాతం మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకున్నారని మిగిలిన వారందరి వివరాలను త్వరితగతిన నమోదు చేయాల్సి ఉందన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారి చంద్రశేఖర్ విఎల్ఈలకు క్షుణ్ణంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ సంగీతలక్ష్మి, ఈడిఎం శివ, ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి, పరశురాముడు దేవాలయ ముఖ ద్వారా ఆర్చీని ప్రారంభించిన ఎమ్మెల్యే

**గద్వాల జనవరి3, ప్రభాతవార్త:** జోగుళాంబ గద్వాల జిల్లా జమ్మిచేడు సమీపంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి పరశు రాముడు దేవాలయ ముఖాద్వార ఆర్చీ గేట్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించినారు. శనివారం శ్రీజమ్ము లమ్మ అమ్మవారి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులను పొందారు. అనంతరం వేణుగోపాల్ సోదరుల ఆధ్వర్యంలో దేవస్థానానికి నిర్మిం చిన ఆలయ ముఖ ద్వారానికి పూజలు నిర్వహించి ప్రారంభిం చారు. దేవాలయ ధాతల ఆధ్వర్యంలో దేవస్థానానికి నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులకు భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. నడిగడ్డ భక్తులే కాకుండా కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రాంత భక్తులు కొలిచే ఇలవేల్పు జమ్మిచేడు శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి దేవస్థాన అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఆలయ అభివృధి కోసం ధాతల ద్వారా, ప్రభుత్వం ద్వారా కావలసిన అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి కృషిచేస్తానని తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచడానికి నావంతు కృషి ఉంటుందని,అమ్మవారి చల్లనిచూపు ఎల్లవేళలా ప్రజల పై ఉండాలని ఈ ప్రాంత అభివృద్ధికి అమ్మవారి కరుణ ఉండాలని వారు కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రా ములు, ఈ ఓ పురేందర్, మాజీ మున్సి పల్ ఛైర్మన్ వేణుగోపాల్, నాయకులు జమ్మిచేడు చెన్నయ్య, ఆలయం కమిటీ డైరెక్టర్స్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన జమ్ములమ్మ దేవాలయ ముఖ ద్వారం

# జాతీయ రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం

**నారాయణ పేట, జనవరి3 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పేట పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో వాహనదారులకు రహదారి నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బోధిశ్రీ, ఏఎంవీఐ సాయి తేజరెడ్డి, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతాయని తెలిపారు. హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను గులాబీ పూలు అందజేసి సత్కరించి ప్రోత్సహించారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన కార్యక్రమం వాహనదారుల్లో సానుకూల స్పందనను తీసుకువచ్చిందని అధికారులు తెలిపారు. ఈ తరహా కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## 10న ప్రవేశ పరీక్ష

**మహబూబ్‌నగర్, జనవరి3 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి 50 రోజులపాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈశిక్షణ మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమా తరం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నది. దీనికి సంబం ధించిన పదవ తరగతి విద్యార్థులు అర్హత పరీక్షను జనవరి 10న ,ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద మోడ్రన్ హై స్కూల్లో పరీక్ష నిర్వహించను న్నారు. పరీక్షకు ప్రభుత్వ పాఠశాలలో చదివే పదోతరగతి విద్యా ర్థులు ప్రతి తెలుగు మీడియం,ఇంగ్లీష్ మీడియం ప్రతి మీడియం నుండి 5 మంది మాత్రమే హాజరు కావలసి ఉంటుంది. ఈ శిక్షణ జనవరి 19నుంచి మార్చి 10 వరకుఉండనున్నది. ఈ అవకాశాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వినియోగించుకోవాల్సిందిగా ఎమ్మెల్యే తెలిపారు.

## మైనార్టీలకు స్వయం ఉపాధి పథకాలు

**గద్వాల జనవరి3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ మైనారిటీల కొరకు రెండు కొత్త పథకాలను స్వయం ఉపాధి ప్రోత్సాహకంగా ప్రారంభించిందని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకం: వితంతువులు, విడాకులు పొందిన మహిళలు,అనాథలు,అవివాహిత మహిళలకు స్వయం ఉపాధి సాధనకోసం రూ.50,000/ ఆర్థిక సహాయం అందజేయబడుతుందనీ తెలిపారు. రేవంతన్నా కా సహారా - మిస్కీన్‌ల కోసం: ఫకీర్, దూదేకుల వంటి వెనుకబడిన మైనారిటీ వర్గాల వారికి ద్విచక్ర వాహనాలు (మోపెడ్స్/బైక్స్) ఖర్చు లక్ష రూపాయల వరకు 100సబ్సిడీతో పంపిణీ చేయబడునని తెలి పారు. ఈ పథకాల కోసం దరఖాస్తుదారులు ఆన్‌లైన్ వెబ్సైట్ ద్వారా ఈనెల 5 నుండి 10 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకో వచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం 7013032567 నంబర్ లేదాజిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంను సంప్రదించాలని కోరారు.

## కౌకుంట్లలో శివ దీక్ష స్వీకరణ

**దేవరకద్ర,జనవరి 3 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో పౌర్ణమి సందర్భంగా శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి శివదీక్ష మాలాధారణ స్వీకరించనైనది. మాల ధారణ శివ స్వాములు శనివారం నుండి మహాశివరాత్రి వరకు 45 రోజులు నిష్ఠగరిష్టతో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. మాల ధారణ స్వీకరించిన వారిలోరామకృష్ణ, శివ,కాశీం శివ,రవి స్వామి, గురుస్వాములు, దాదాపు20 మంది శివమాల ధారణ స్వీకరించారు. మాలధారణ గోపన్ పల్లి మఠం సురేష్ స్వామి అర్చకులు మాలవేసి ఆశీర్వదించి, మూక్తిమార్గంలో నడవాలని, నిత్యము శివ పంచాంక్షారీ మంత్రం జపిస్తూ శివానుగ్రహం పొంది, గ్రామ ప్రజలు కుటుంబం సభ్యులు సంపూర్ణ ఆరోగ్యం,ఆయుషుతో జీవించాలని బోధించి ప్రవచన సందేశం అందించారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**అలంపూర్ జనవరి3 ప్రభాతవార్త :** ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన మరియు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి జోగులాంబ గద్వాల జిల్లా టీ. శ్రీనివాసరావు ఐపిఎస్. ఆదేశాల మేరకు, అలంపూర్ పోలీసు వారి ఆధ్వర్యంలో శనివారం అలంపూర్ టౌన్‌లోని కేజీబీవీ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనిలోని భాగంగా సైబర్ నేరాలపైఅలంపూర్ ఎస్సై.రామకృష్ణ మాట్లాడుతూ, బ్యాంకుల పేరుతో మోసాలు ,అనుమానిత లింకు లేదా ఏ పి కే.ఫైల్ మోసం, క్యూ ఆర్ కోడ్ మోసం, సోషల్ మీడియా వాట్సాప్, ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్, డిపి స్కాం,జాబ్ మోసం, పెట్టుబడి మోసం, కస్టమర్ కేర్ మోసం, గిఫ్ట్ ,ఆన్లైన్ షాపింగ్ ప్రకటన, డిజిటల్ అరెస్ట్ ,లోన్ యూపీఐ యాప్ వంటిసోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అంతే కాకుండా ఎవరైనా సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే గోల్డెన్ హావర్ వినియోగించుకుని, డబ్బులు పోయిన వన్ అవర్‌లోపు 1930కి కానీ దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలనీ తెల్పినారు. ఇట్టి కార్యక్రమం లో కేజీబీవీ టీచర్స్, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో మొదలైన అభివృద్ధి పనులు

**నవాబుపేట, జనవరి3 ప్రభాతవార్త :** స్థానిక సర్పంచుల ఎలక్షన్లు ముగిసిన కొద్ది రోజుల్లోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నట్లు కనిపిస్తుంది. ఆయా గ్రామాలలో కొందరు సర్పంచులు కుంటిపడిన అభివృద్ధి పనులను తాగునీటి సమస్య, మురుగు కాలువలు, వీధిలైట్లు, గ్రామ పారిశుధ్య పనులు, లీకేజీ పైపు లైన్ల మరమ్మతులు, ఇలా మరెన్నో అభివృద్ధి పనులు గ్రామాల్లో చక చక చేస్తూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజలు వారిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనులు చేయిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని మల్లారెడ్డి పల్లి గ్రామంలో రోడ్డుపై సర్పంచ్ తోటరాములు, నవాబుపేట మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చేయించారు. సర్పంచ్ రవీందర్ వీధిలైట్ల మరమ్మతులు, ఎన్మన్‌గండ్ల గ్రామంలో సర్పంచ్ రంజిత్ కుమార్ పలుఅభివృద్ధి కార్యక్రమాలు,కూరగాయల సంత ప్రారంభం, కారూర్ గ్రామంలో నాలా మరమ్మతులు సర్పంచ్ ఎర్రోళ్ల శంకర్ చేయించారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేయడానికి నూతన సర్పంచులు ఉత్సాహంగా ఉన్నట్లు అర్థమవుతుంది.

## చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు రూ.4 లక్షలు నగదు అందజేత

**మక్తల్ టౌన్, జనవరి 3 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహ ప్రతిష్టాపన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా చిట్యాల గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తమ వంతుగా రూ. 4 లక్షల నగదును ఇవాళ శివాజీ యూత్ సభ్యులకు సంఘం సభ్యులు మాజీ సర్పంచ్ బి.నర్సిములు, ఉల్లా లక్ష్మణ్, మాజీ ఎంపిటిసి రామలింగప్ప అందజేశారు. విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే మరికొంత ఆర్థిక సాయం అందిస్తా మని ముదిరాజ్ సంఘం సభ్యులు భరోసా ఇచ్చారు. విగ్రహ ప్రతి ష్టాపనకు ముందుకొచ్చిన యువతను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు కావలి పెద్ద రాములు, ముడుమల్ లింగప్ప, దుకాణం తమలప్ప, పందిరామలింగప్ప,సింహాద్రి,పుల్లారి శ్రీనివాసులు,పుల్లారివెంకటేష్, నాగేష్, బి.వెంక టేష్, సి.దత్తు, వాకిటి నరసింహులు, గొర్రె కండ్ల వెంకటయ్య, శివాజీ యువజన సంఘం అధ్యక్షులు పుల్లారి అంజి, ఉపాధ్యక్షులు ఇంటెనికి నరసింహ, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, కోశాధికారి లక్ష్మీపురంరంగప్ప, కార్యదర్శులు చాకలి అనిల్, అంజప్ప, పుల్లారి పరుశురాం, బి.రాము పలువురు పాల్గొన్నారు.

## కృష్ణ గోకులం పాఠశాలలో గ్రీన్ డే

**నారాయణ పేట,జనవరి 3 ప్రభాతవార్త:** నారాయణ పేట పట్టణంలోని కృష్ణ గోకులం పాఠశాలలో ఎల్‌కేజీ విద్యార్థులతో గ్రీన్ డే కార్యక్రమాన్ని ఘనంగానిర్వహించారు. చిన్నారులకు పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ డా. ఉమాదేవి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, పసితనం నుంచే పచ్చదన ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో గ్రీన్ డే నిర్వహిస్తున్నామనితెలిపారు. పచ్చదనం సకలశుభాలకు సంకేతమని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. చిన్నారులు ఆకుకూరలు, ఆకుపచ్చని పండ్లు, ఆకుపచ్చని వంటకాలతో కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని ప్రశంసించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు సుజాత, సూర్యకళతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతో అయిజ రూపురేఖలు మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

బలమైన అభ్యర్థిని నిలబెట్టి గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సహకారంతో, కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు తీసుకువచ్చి అయిజ మున్సిపాలిటీ రూపురేఖలు మార్చే అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. అయిజ అభివృద్ధి అంటే ఏమిటో బీజేపీ చేతల్లో చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయిజ మున్సిపాలిటీలో బీజేపీ చేయబోయే ముఖ్య పనులు శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ప్రతి వార్డులో సీసీ రోడ్లు, అంతర్గత రహదారుల అభివృద్ధి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు స్ట్రీట్ లైట్స్, పారిశుధ్య మెరుగుదల, మహిళలు, యువత, రైతుల కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలుకేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం భారతీయ జనతా పార్టీ బాధ్యత వహిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి రవి ఎగ్బోటే, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదన్న, అయిజ పట్టణఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, బెల్లంకొండ నాగరాజు, ఖుషి, అంజి, రవి గౌడ్, వీరేష్ గౌడ్, మాధవాచారి, తెలుగు కృష్ణ, ప్రదీప్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పెట్టుబడి సాయం రూ.10,000

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి ప్రజలను చైతన్యపరిచే విధంగా చర్యలు ముమ్మరం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లోనే కాకుండా వచ్చే శాసనసభ ఎన్నికల్లో బిజెపి అధికారం చేజిక్కించుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో అవకాశాలుపుష్కలంగా ఉన్నాయని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి పార్టీష్టతకు రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పా టు చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్దలై పని చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా పార్టీ అధ్యక్షులు సత్యయాదవ్, ఆత్మకూరు మండలపార్టీ అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్, ఆత్మకూరు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్వినికుమార్, బిజెపి నాయకులు సురేష్‌ఎల్లన్న మనోహర్‌గౌడ్, దేవరపల్లి ఆంజనేయులు లక్ష్మీకాంత్, ముదిరాజ్, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొనగా సమావేశానికి గ్రామ సర్పంచ్ రామ్ రెడ్డి అధ్యక్షత వహించారు.

## సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శప్రాయం

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు ఉద్యోగులు చాలా బాగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే వేషధారణలో చిన్నారులు వేసిన సాంస్కృతికనృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మదనాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, ఎంఈఓలు, మహిళా ఉపాధ్యాయులు ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై భర్త దాడి: కేసు నమోదు

**లింగాల, జనవరి 3 ప్రభాతవార్త:** భార్యపై భర్త దాడి చేసిన సంఘటన లింగాల మండలంలోని క్యాంపు రాయవరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం క్యాంపు రాయవరం గ్రామానికి చెందిన జక్కుల వెంకటమ్మ, శ్యాంసుందర్ భార్యాభర్తలు ఇద్దరు శుక్రవారం రాత్రి సమయంలో కూలీల డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. కోపానికి గురైన భర్త గొడ్డలితో కొట్టపోయాడు. ఆమె తప్పించుకునే ప్రయత్నంలో ఎడమ చేతి చిటికెన వేలుకు తగిలి గాయమైంది. అదే గొడ్డలి కర్రతో తన ఇష్టం వచ్చినట్లుగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిపారు. ఆర్ఎంపీ వైద్యునితో వైద్యం చేయించి, వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ కొట్టడానికి ప్రయత్నించగా తప్పించుకుని ఊరు బయట పొలంలో పడుకొని శనివారం లింగాల పోలీస్ స్టేషన్ కు వచ్చి భర్తపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రెస్టారెంట్‌లో తనిఖీలు

**మక్తల్ టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :** మక్తల్ పోలీసు స్టేషన్ పరిధిలో దాసారిపల్లి గ్రామ శివారులోని ఎన్‌హెచ్-167 జాతీయ రహదారి పక్కన గల శ్రీసాయి బాలాజీ దాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న తంబెళ్ళ రాజశేఖర్ తండ్రి చిన్న వెంకటయ్య (30) సంవత్సరాలు, నేతాజీ నగర్, మక్తల్ పట్టణానికి చెందిన వ్యక్తి అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించి, అతని వద్ద నుంచి 6 కింగ్‌ఫిషర్ బీర్ బాటిళ్లను పట్టుకొని సీజ్ చేయడం జారిందని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయించినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని ఆయన కోరారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**శ్రీరంగాపూర్, జనవరి 3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో చాకలి అమరచింత గణేష్ ప్రమాదవశత్తు నాలుగు రోజుల క్రితం కాలువ లో పడి మరణించడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి మృతుని కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ విషయాన్ని శ్రీరంగాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు రామచంద్రయ్య ఎమ్మెల్యే మేగా రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే మెగా రెడ్డి స్పందించి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయంగా ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. శ్రీహరి రాజు, బొక్కలయ్య రామచంద్రయ్య, గోవిందు, బహుజన రమేష్, ఆశన్న, శ్రీనివాసులు, టైలర్ అంజి, నవీదు, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగ అభివృద్ధి ప్రణాళిక లక్ష్య సాధనకు సమన్వయంతో కృషి చేయాలి

**నారాయణ పేట, జనవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట వ్యవసాయ అనుబంధ రంగ అభివృద్ధి ప్రణాళిక లక్ష్య సాధనకు పీఎండీడీకేవై కమిటీ సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని జాయింట్ సెక్రెటరీ, సెంట్రల్ నోడల్ అధికారి రమణ్ కుమార్ అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు ఇంచార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్ స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా భౌగోళిక స్వరూపం, వనరులకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పంట తీవ్రత, ఉత్పాదకత, పంటకోత అనంతర మౌలిక సదుపాయాలు, ఉద్యా నవనం, మత్స్య, పశుపోషణ రంగాలకు సంబంధించి ఆరేళ్ల ఫలితాధారిత లక్ష్యాలు ఉండాలన్నారు. మొత్తం 36 పథకాలను ఆయా మంత్రిత్వ శాఖల సహకారంతో అమలు చేయాలని తెలిపారు. నిధుల కోసం ఎదురు చూడకుండా అందుబాటులో ఉన్న వనరులను వినియోగించాలని సూచించారు. ప్రతినెలజిల్లాకలెక్టర్ నేతృత్వంలో పురోగతిపైచర్చించాలని ఆదేశించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలపైఅవగాహన కల్పించాలని తెలిపారు. నాబార్డు సహకారంతో రుణాల ప్రవాహం పెంచాలని సూచించారు. జిల్లాలో మత్స్య సంపద, పాల ఉత్పత్తి పెంపునకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఎండీడీకేవై ఆరేళ్ల వార్షిక ప్రణాళికపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

### లోక కళ్యాణార్థం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

**దేవరకద్ర, జనవరి3 ప్రభాతవార్త:** విశ్వహిందూ పరిషత్ దేవరకద్ర ఆధ్వర్యంలో శనివారం పౌర్ణమి సందర్భంగా శ్రీశ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం సామూహికంగా గ్రామస్తులందరి చేత చేయించడం జరిగింది. కుల, మత బేధం లేకుండా సామూహికంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతానికి దేవరకద్ర గ్రామ ప్రజలే కాక వివిధ గ్రామాల నుండి కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కనుక విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహిం చామని, గ్రామస్తులందరూ ఒకేచోట కలుసుకొని పూజలో పాల్గొనడం చేత పరిసర ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడిందని అన్నారు. విధంగా మన హిందూ సనాతన ధర్మాన్ని ప్రజలందరూ ఆచరించాలని ఆదేశించారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి







**భూత్పూర్, జనవరి3, ప్రభాతవార్త:** భారత ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిభాయి పూలె 194వ జయంతిని పురస్కరించుకుని శనివారం భూత్పూర్ మండలం పోతులమడుగు, అన్నాసాగర్ గ్రామాల్లోని ఆయా పాఠశాలల్లో వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. పోతులమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, భూత్పూర్ మండల ఇంచార్జీ ఎంఈఓ ఉషారాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సావిత్రిభాయి పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నిరంజన్, రాఘవేందర్, రాము, సేవియా, నిహారిక పాల్గొన్నారు.

**బిజినేపల్లిలో:** సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పూలే అంబేద్కర్ చౌరస్తాలోబీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన సంఘం రాష్ట్ర నాయకులు మంగి విజయ్, నూతన సర్పంచులు మిద్దె ఇందిరా రాములు, పానుగంటి మాధవి, దాసర్ల ప్రణీత, ఉప్పనమోని లక్ష్మమ్మ, మారేపల్లి శివలీల చంద్ర గౌడ్, పిట్టల జ్యోతి శంకర్, ఉప సర్పంచులు హైమావతి నగేష్, శారదా శంకర్ గౌడ్, వినీత్‌గౌడ్, బీసీ సంఘం నాయకులు వెంకటస్వామి, రాజేందర్ గౌడ్, పరశురాములు, దశరథం, శివ, సత్యశీల సాగర్, బంగారి పర్వతాలు, రామన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**చిన్నచింతకుంట, జనవరి3 ప్రభాతవార్త:** నాటి సమాజంలో అసమానతలపై పోరాడిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని ఎంపీడీవో లక్ష్మి నరసింహులు తెలిపారు. శనివారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సూపరింటెండెంట్ మోసిన్, సీనియర్ అసిస్టెంట్ మద్దిలేటి, సర్వేయర్ నరేందర్, జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రఘు, జిపిఓలు దేశన్న, రాములు పాల్గొన్నారు.

**నవాబ్ పేట, జనవరి 3 ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా పలు స్కూల్లలో గ్రామాలలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కార్యాలయంలో అధికారులు సావిత్రిబాయి పూలేజయంతిని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించుకోగా కాకర్ల పహాడ్ యుపిఎస్ పాఠశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే జన్మదిన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సహ ఉపాధ్యాయులబృందం, పాఠశాల చైర్మన్ నర్సమ్మ, గ్రామసర్పంచ్ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఉప సర్పంచ్ అంబేద్కర్, గ్రామ ప్రజలు, విద్యార్థులసమక్షంలో ఘనంగానిర్వహించి నివాళులు అర్పించడం జరిగింది.

**ధన్వాడ, జనవరి 3 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, ధన్వాడలో మహాత్మా జ్యోతి రావు పూలే విద్య అభివృద్ధి సేవ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నీరటి రాఘవేందర్ నాయుడు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జడల బాల్‌రాజ్, ధన్వాడ గ్రామ సర్పంచ్ పి. జ్యోతి రామచంద్రయ్య ,ఉప సర్పంచ్ పూజారి నర్సింలు, ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, శోభారాణి, పి. రామచంద్రయ్య, రాఘవేందర్ రెడ్డి, జయప్రకాష్, ఇర్ఫాన్, జుట్ల సుదర్శన్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, కావలిరవికుమార్, కురుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**గోటూర్‌లో:** ధన్వాడ మండలంలోని గోటూరు గ్రామ పంచాయతీ పరిధిలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే 195వజయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గోటూరు గ్రామ సర్పంచ్ సి. నాగమణి చంద్రమౌళి, ఉపసర్పంచ్ లావణ్య జైపాల్ రెడ్డి, నారాయణపేటకాంగ్రెస్ జిల్లా నాయకులుగౌనినాగేశ్వర్‌రెడ్డి పాల్గొనిసావిత్రి బాయి పూలే సేవలను కొనియాడారు. మహిళా విద్యాభి వృద్ధికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆమె ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. అలాగే గోటూరు గ్రామ కార్యదర్శి శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు బి.వెంకటేష్, వెంకట్రాములు, మాజీ ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

**ఉప్పునుంతల, జనవరి3 ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే పూలే జయంతి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలో ప్రభుత్వ ,ప్రైవేటు విద్యాసంస్థల తో పాటు ప్రభుత్వ కార్యాలయం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బలరాం నాయక్, జూనియర్ అసిస్టెంట్ అబ్రహార్, శివ, జిపిఓలు శంకర్, సతీష్ కుమార్, కవిత, ఉమా రమణమ్మ, లాలయ్య, శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్టూర్‌లో... గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ తో పాటు ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, మాజీ సర్పంచ్ జంగయ్య, యువకులు గుద్దటి బాలరాజు, ఉప్పరిబాలరాజు, గ్రామపంచాయతీ వార్డుసభ్యులు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**శ్రీరంగాపూర్, జనవరి 3 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో శనివారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అంబేద్కర్ యువజన సంఘం సహాయ కార్యదర్శి జమ్మన్నగారి రాముడు, శ్రీరంగాపూర్ గ్రామ ఉపసర్పంచ్ కళ్యాణి కాజా, మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి, వార్డు మెంబర్లు జి.పుష్పలత, కే.అంజి, కే.భాస్కర్, అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి జి.క్రాంతి కుమార్, బీఎస్పీ సీనియర్ నాయకుడుఆర్పీబీసన్న, వికాస్, భరత్, మహే శ్వరి, అయ్యన్న, నాగరాజు, ఎండి అలీ, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**దేవరకద్ర, జనవరి3 ప్రభాతవార్త:** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జీవితం సమాజానికి ఎంతో స్ఫూర్తి దాయకమని లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల ఇంచార్జి ప్రధానోపా ధ్యాయులు, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త లయన్ అశ్విని చంద్రశేఖర్ అన్నారు. శనివారం దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి ఆయా పాఠశాలలఉపాధ్యాయులు, విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌యం కెకె శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాలఇంచార్జి హెచ్‌యం అశ్విని చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కోటకద్ర మురళీధర్, దోమ శంకర్, తూడి నాగేశ్వర్‌రెడ్డి, విద్యాభిమానులు మాడమోని వెంకట్రాములు, కొండన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

**దామరగిద్ద, జనవరి 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వివిధ గ్రామల లోశనివారం చదువులతల్లి సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. దామరగిద్ద మండల కేంద్రంలో సిపియం పార్టీ ఆధ్వర్యంలో సావిత్రి భాయ్ పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. క్యాతన్ పల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గోవిందు అధ్యక్షతన సాయిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ,మాజీ సర్పంచ్ నారాయణ, వార్డుసభ్యులు నర్సింహ, బాలప్ప, గ్రామ యువకులు పాల్గొన్నారు.

**నర్వ, జనవరి 3 ప్రభాతవార్త :** నర్వ మండల పరిధిలోని రాయికోడ్ సావిత్రీబాయి పూలే, జ్యోతి రావు పూలే విగ్రహ నిర్మాణ కమిటి ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలను సంఘం సభ్యులు, గ్రామస్తులతో కలిసి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షులు మల్లన్ కోటి శంకర్ ,ఉప సర్పంచ్ మ్యతరీ గోపాల్, రాయికోడ్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినిలు, గ్రామపెద్దలు కెవెన్ స్వామి, ఖాజా మైనోద్దీన్, జబ్బార్, బుడ్డ ఎల్లప్ప, వార్డు సభ్యులు గడ్డమీది శ్రీను, అ జయ్, రాము, నరసింహ, పుల్లరి ఆనంద్, ఎద్దుల అంజి, కె.సురేందర్ గౌడ్, రంగప్ప, గుడ్డినర్సింలు, వెంకటయ్య, ఉపాధ్యాయులు యంమల్లేష్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

**నారాయణపేట, జనవరి 3 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన వైజ్ఞానిక సదస్సు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి గోవిందరాజులు, జిల్లా ఫిషరీస్ చైర్మన్ కాంతు కుమార్, జిల్లా పౌర సంబంధాల అధికారి రషీద్, ఏఎంఓ విద్యాసాగర్, జిల్లా ప్రణాళిక అధికారి నాగార్జున రెడ్డి, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, జీసీడీఓ సంగీత, యాదయ్య శెట్టి, మండల విద్యాధికారులు బాలాజీ, ఆంజనేయులు, బాల కిష్టప్ప, మాధవి, కృష్ణ రెడ్డి, నిజాముద్దీన్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షులునర్సింహ, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు హైమావతి, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, రుద్రసముద్రం రాములు, కనకప్పలతో పాటు పలువురు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్ జనవరి3, ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం రోజు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడమే కాకుండా కళాశాలలోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సైదులతో పాటుగా అధ్యాపక బృందం భాగ్య వర్ధన్ రెడ్డి, విశ్వేశ్వర్, కురుమూర్తి, రాఘవేందర్ తదితరులతో పాటుగా పలువురు అధ్యాపక మరియు కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**మల్దకల్ జనవరి 3, ప్రభాతవార్త:** మహిళలకు స్ఫూర్తి సావిత్రి బాయ్ పూలే మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెస్స్ యూనిట్స్ ఆధ్వర్యంలో నేడు సావిత్రి బాయ్ పూలే జయతి ని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహులు, విళీళీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామాంజనేయులు గౌడ్, అధ్యాపకులు గోవర్ధన్ శెట్టి, రాఘవేంద్ర, సుధాకర్, శ్రీకాంత్, రంగస్వామి, ఇఫ్తికర్ మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

**వనపర్తి, జనవరి 3 ప్రభాతవార్త:** హరిజనవాడ ఉన్నత పాఠశాల, వనపర్తిలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు 195 వ జయంతిని పురస్కరించుకొని వనపర్తి పట్టణంలోని హరిజనవాడ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్. చంద్రశేఖర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వనపర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, నారాయణమ్మ (అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, వనపర్తి జిల్లా), పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు వాకిట రవికుమార్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**వీపనగండ్ల జనవరి3, ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే 195వ జయంతి వివిధ గ్రామపంచాయతీ లతోపాటు పాఠశాలలో జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు సందర్భంగా వారి చిత్రపటానికి పూలదండలు వేసి ఆమె ఆశయం కోసం నిలబడతామని ప్రతిని కోరారు. అదే విధంగా గోపాల్ దీన్నే గ్రామ సచివాలయంలో ఆ గ్రామ సర్పంచ్ దొడ్డ కవిత చిత్రపటానికి పూల దండ వేసే నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డిబాల్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటస్వామి, గ్రామ కార్యదర్శి కర్ణాకర్, వార్డు మెంబర్స్ కురుమయ్య, చంద్రయ్య, సత్తెమ్మ, శేఖర్, గ్రామ యువకులు దేవయ్య, శ్రీకాంత్, గ్రామ రైతులు ఈశ్వర్ రెడ్డి, జుర్రు కుర్మయ్య, అంగన్వాడి సిబ్బంది, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

**గండీడ్ జనవరి 3, ప్రభాతవార్త;** జనవరి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం గండీడ్ మండలం బల్సురుగొండ గ్రామపంచాయతీ ఆవరణలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి గ్రామ సర్పంచ్ కాజా మైనుద్దీన్, ఉప సర్పంచ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సంస్కర్తగా ఆమె చేసిన కృషి మరువలేనిదని ఈ కార్యక్రమంలో రాజేందర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి శిరీష రెడ్డి, వార్డు సభ్యులు బసి రెడ్డి, కావలిఆంజనేయులు, బసిరెడ్డిపల్లి అంజయ్య, హరిజన్ బాబు, బి ఆర్ ఎస్ నాయకులు మాధవరెడ్డి, కొండారెడ్డి, నాగిరెడ్డి, ఈడిగి వెంకటయ్య గౌడ్, రామచంద్రారెడ్డి, చాంద్ పాషా, వాసుదేవ చారి, కాంగ్రెస్ నాయకులు ఎం గోవర్ధన్ రెడ్డి, ఎం. రాజేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, పార్వతి కళ్యాణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మక్తల్ టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :** అణగారిన వర్గాల విముక్తి కోసం పాటుపడి మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహా త్యాగశీలి సావిత్రిబాయి పూలే జయంతిని అంబేద్కర్ నగర్ లోని అంబేద్కర్ భవన్ లో డా.బి ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కె.కుర్మయ్య, అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు జె నర్సిములు, సావిత్రి బాయి పూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాను, బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు జె.సాగర్ తదితరులు పాల్గొని సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

**నర్వ, జనవరి3 ప్రభాతవార్త:** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహనీయులు, క్రాంతి జ్యోతి, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత అన్నారు. శనివారం సావిత్రి బాయి పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి సేవలను స్మరించుకుంటూ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత మాట్లాడుతూ స్త్రీలకు విద్య హక్కు అనే భావనే లేని కాలంలో బాలికల విద్య వ్యాప్తికి ఆమె చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు రాజు, ప్రకాష్, మల్లేష్, శ్రీనివాసులు, మురళి ప్రసాద్, యాదమ్మ, స్నేహ, అబ్దుల్ సలీం, శ్రీశైలం, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

**అలంపూర్ జనవరి3 ప్రభాతవార్త :** భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎమేలమ్మ, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చదువుల తల్లి సావిత్రి బాయి పూలే జయంతి జరుపుకోవడం ఎంతో అదృష్టం అన్నారు. సావిత్రి బాయి పూలే ఉపాధ్యాయ వృత్తిలో ఉండి అనేకమంది నిరక్షరాశులకును అక్షరాసులుగా తీర్చిదిద్దిన ఘనత ఆమెదే అని అన్నారు. జిల్లా నాయకులు లక్ష్మీకాంతమ్మ, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**లింగాల, జనవరి 3 ప్రభాతవార్త:** విద్యార్థులు సావిత్రిబాయి పూలే అడుగు జాడల్లో నడవాలని ఎంఈఓ బషీర్ అహ్మద్ అన్నారు. శనివారం లింగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ బృందంతో కలిసి సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం, శంకరయ్య, రామచంద్రం, శేఖర్, నరసింహులు, వసంత్ యాదవ్, రమేష్, శివకుమార్, సురేష్, రాజా, శ్రావణ్ కుమార్, చిన్నయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మంగమ్మ, మహిళా ఉపాధ్యాయురాలు శశికళ, యాదమ్మ, కవితారాణి, సుజాత, ఫర్హానాబేగం పాల్గొన్నారు.






# మారుమ్రోగిన అయ్యప్ప నామస్మరణ



**నారాయణపేట, జనవరి3 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణ కేంద్రంలోని సరాఫ్ బజార్ శ్రీ బసవేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని శబరి పీఠం సన్నిధానంలో గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి 34వ మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. మూడు గంటల పాటు భక్తజన సందోహం మధ్య భజనసంకీర్తనలు శరణుఘోషలతో కార్యక్రమం కన్నుల పండువగా కొనసాగింది. ఈ సందర్భంగా గణపతి, అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలతో కలశ పూజలు నిర్వహించి 18 మెట్లకు విశేష పూజలు చేశారు. ఉత్సవమూర్తికిచందన, కుంకుమ, భస్మ, జల, ఫలపుష్పాభిషేకాలు, మహా పంచామృతాభిషేకం, కనకాభిషేకం ఘనంగా నిర్వహించారు. 18 మెట్లపై కర్పూరం వెలిగించి తుళ్లి ఆటలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అంతకుముందు ఉదయం బారం బావి శివాలయం నుండి కలశాన్నిరాఘవేంద్రాచారి పూర్ణం, అశోక్ పుష్కలం, మణి ఎత్తుకొని మేళతాళాల నడుమ పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వాములు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. 18 సంవత్సరాలు మాలధారణ చేసిన గురుస్వాములను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మనోహర్ గౌడ్, గండె చంద్రకాంత్, అప్పి కాకర్ల భీమయ్య, జంగిటి వెంకటేష్, బొంబాయ్ బాలాజీ, శంకర్ రెడ్డి, కిషోర్ గౌడ్, బాబు నర్సింహులుగౌడ్, శ్రీనివాస్, బట్టి తిప్పన్న, కన్నయ్యలతో పాటు సైదాపూర్, గుర్మిట్కాల్, ఉట్కూరు, మద్దూర్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములు పాల్గొన్నారు.

**బిజినేపల్లి, జనవరి3 ప్రభాతవార్త:** ఆనందగిరి కొండపై అయ్యప్ప స్వామి వారి ఆలయ ఆవరణలో అయ్యప్ప సేవా సమితి గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఇరుముడి మహోత్సవం శనివారం నిర్వహించారు. ముందుగా నిత్య పూజలో భాగంగా అగ్రగామి గణపతి, షణ్ముఖ, అలంకార ప్రియునికి అష్టోత్తర శత నామావళి నామాలతో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కన్నె స్వాములతో మొదలుకొని గురుస్వాముల వరకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఇరుముడి కార్యక్రమం ముగిసిన అనంతరం మాలదారులు ఇరుముడిని నెత్తిన పెట్టుకొని ఏకశిలా పదునెట్టంబడి ఎక్కి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. గురుస్వాములు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవ చింతనతో ముందుకు సాగాలని ఇరుముడి అంటే రెండు ముడులు కలది. ఆ రెండూ భక్తి, శ్రద్ధ. ఇరుముడికి కట్టే తాడు ప్రణవం. భక్తి, శ్రద్ధలను సాధనతో పొందగలిగితే స్వామి అనుగ్రహం లభిస్తుందిఅన్నారు. శివ, కేశవ సంయోగరూపమైన అయ్యప్పస్వామి యోగ, జ్ఞానమయ మంగళమూర్తిగా శబరిగిరి మీద భక్తులకు దర్శనమిస్తున్నారని అయ్యప్పకు ధర్మశాస్త్ర అనే పేరుంది. ఇది ధర్మం, ఇదియోగం అని శాసించి ఆచరింపజేసేవాడు కనుకనే గురు స్వరూపుడైన అయ్యప్పనుశాస్త్ర అన్నారని చెప్పారు. అయ్యప్ప నిరంతరం చిన్ముద్ర ధరించి ఉంటాడని. బొటనవేలు, చూపుడువేలుకలిపి ఉంచటాన్ని చిన్ముద్ర అంటారు. జ్ఞానానికి ప్రతీక అయిన దక్షిణామూర్తి చిన్ముద్ర ధరించి ఉంటాడు. అయ్యప్పకూడా ఈ ముద్ర ధరించటమంటే ఈ స్వామి దక్షిణామూర్తి స్వరూపమని అర్థం చేసుకో వాలని సూచించారు. అనంతరం మండల దీక్ష పూర్తయిన తర్వాత శబరి మలలో కొలువైన అయ్యప్ప దర్శనానికి ఇరుముడి కట్టుకొని స్వాములు బయలుదేరారు. ఇరుముడి మహోత్సవంలో మండల కల్లుగీత కార్మిక సంఘంఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో నాయినోళ్ళ బాలరాజుగౌడ్, వంగ రాజుగౌడ్, గురుస్వాములు పురేందర్ రెడ్డి, అయ్యప్ప సేవా సమితి సభ్యులు



ఇరుముడితో ఏకశిలా పదునెట్టం బడి దర్శనంలో స్వాములు